

నందికొండ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పట్టుకొన్న జిలెటిన్ స్టిక్స్. ఇన్‌సెట్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

## 1450 కిలోల జిలెటిన్ స్టిక్స్ పట్టివేత

నందికొండ, మార్చి 20 : పోలీసులు భారీగా పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నందికొండ పైలాన్ కాలనీలోని తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ చందనాదీప్తి మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నందికొండలోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. బుధవారం తెల్లవారు జామున ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వ్యాన్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా 1,450 కిలోల జిలెటిన్ స్టిక్స్‌ను, 300 మీటర్ల పొడవు గల సేఫ్టీ ఫ్యూజ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్ నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారించగా ఆధారాలు చూపకపోవడంతో విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్పీ తెలిపారు.

## ఇన్‌చార్జి డీఎంఈ నియామక జీవో రద్దు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): మెడికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జి డైరెక్టర్‌గా (డీఎంఈ) డాక్టర్ ఎన్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. తెలంగాణ సబార్డినేట్ సర్వీసు నిబంధనల్లోని 10(హెచ్ )కు, 2017లో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా జీవో 63 ఉన్నదని ప్రకటించింది. అందుకే జీవో అమలును నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. చట్ట ప్రకారం రెగ్యులర్ డీఎంఈని నియమించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఇంచార్జి డీఎంఈగా డాక్టర్ ఎన్ వాణిని నియమిస్తూ ఫిబ్రవరి 19న ప్రభుత్వం జీవో 63ను జారీ చేయడాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిని జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులు వెలువరించారు.

# ‘మార్క్‌ఫెడ్’ నిబంధనల్లో కీలక మార్పులు

- ఎరువుల సరఫరాలో గుత్తాధిపత్యానికి చెక్
- టెండర్ల నిబంధనలను సడలించిన వ్యవసాయ శాఖ



హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ఎరువులను నిల్వ చేయడం, సరఫరాలో ఒకే కంపెనీ మోనోపలీకి చెక్ పెట్టే దిశగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే టెండర్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎరువుల సరఫరా, నిల్వ కోసం నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ టెండర్లు ఆహ్వానించింది. ఈ నెల 26వ తేదీ వరకు అవకాశం కల్పించింది. మొత్తం 22 రేక్ పాయింట్స్ వద్ద రైలు ద్వారా వచ్చే ఎరువులను నిల్వ చేసి అవసరమైనప్పుడు జిల్లాలకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో టెండర్ నిబంధనల ఖరారుకు సంబంధించి ఇటీవల వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ నేతృత్వంలో కమిటీ భేటీ అయింది. ఈ భేటీలో టెండర్ నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. ఎరువుల సరఫరా, నిల్వ ప్రక్రియలో ఉమ్మడి రాష్ట్రం నుంచి ఒకే కంపెనీ గుత్తాధిపత్యం కొనసాగుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతి సంవత్సరం సదరు కంపెనీకే మొత్తం 22 రేక్ పాయింట్ల టెండర్లు దక్కేవి. ఇందుకు మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులు ఆ సంస్థకు పరోక్షంగా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. సంవత్సరాలపాటు నిబంధనలు మార్చకుండా ఒకే విధంగా టెండర్ ప్రక్రియ కొనసాగించడం వల్లే సదరు కంపెనీ ఈ టెండర్లను దక్కించుకోగలిగిందనే ఆరోపణలు వచ్చాయి. మరోవైపు నిబంధనలు కఠినతరంగా ఉండటంతో ఇతరులు కనీసం టెండర్ దాఖలు చేసే పరిస్థితి కూడా లేకుండాపోయింది. దీంతో ఒకే సంస్థ పోటీలో ఉంటడం.. టెండరు ధర కూడా అధిక మొత్తంలో ఉండేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి నిబంధనలు సడలించి ఎక్కువమంది టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. అందులోభాగంగా పలు కీలక అంశాల్లో నిబంధనలను సడలించింది. గతంలో టెండర్లలో పాల్గొనే సంస్థకు కచ్చితంగా ఐదు సొంత లారీలు ఉండాలి. దీన్ని ఐదు లారీల నుంచి మూడు లారీలకు తగ్గించారు. ఇక, ఎరువుల నిల్వ, సరఫరా రెండింటిలో కచ్చితంగా మూడేండ్ల అనుభవం ఉండాలి. దీన్ని సవరించి ఏవైనా బ్యాగ్డ్ మెటీరియల్(ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల బ్యాగులు)లో అనుభవం ఉండాలని సవరించారు. ఇక ఎరువుల నిల్వ, సరఫరా రెండూ ఒకే సంస్థ చేయాలని, ఇందులో కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలని నిబంధన ఉంది. దీంతో సదరు ఒకే సంస్థ మినహా మిగిలిన ఏ సంస్థలు కూడా ఈ నిబంధన ప్రకారం ఉండేవి కావు. దీంతో ఎరువుల సరఫరా, నిల్వలో ఏదో ఒక దాంట్లో ఎక్కువ అనుభవం, మరోదాంట్లో తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ఆ సంస్థకు టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఇలా పలు కీలక నిబంధనల్లో మార్పులు చేయడం వల్ల ఎక్కువ సంస్థలు టెండర్లలో పాల్గొనే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటికే గుత్తాధిపత్యం కొనసాగిస్తున్న సంస్థకే ఎక్కువ రేక్ పాయింట్ల టెండర్లు దక్కొచ్చనే చర్చ జోరుగా కొనసాగుతుండడం కొసమెరుపు.



తన ఫోన్ సీజ్ చేయడంపై పోలీసులతో మాట్లాడుతున్న ఎండీసీ మాజీ చైర్మన్ క్రిశాంక్

## క్రిశాంక్‌పై కేసు.. ఫోన్ సీజ్

- సీఎం బంధువు అవినీతిని ప్రశ్నించడమే నేరమా?
- సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే కేసు పెడ్తరా?
- ప్రశ్నిస్తే విచారణ పేరుతో వేధిస్తారా?
- ఎండీసీ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ మండిపాటు

కంటోన్మెంట్/మాదాపూర్/ మార్చి 20 ( నమస్తే తెలంగాణ ) : ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రశ్నిస్తే కేసులతో భయపెడుతున్నదని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బంధువు ఎనుముల మహానంద రెడ్డి చిత్రపురి సొసైటీకి కోశాధికారిగా వ్యవహరిస్తూ సొసైటీకి సంబంధించి సుమారు రూ. 3వేల కోట్ల అవినీతికి పాల్పడినట్లు తెలియడంతో తాను సోషల్ మీడియా వేదికగా చిత్రపురి సొసైటీకి సంబంధించిన అవకతవకలను బయటపెట్టానని తెలిపారు. ఇటీవల సొసైటీపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకోలేదని చెప్పారు. కేవలం తాను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుడు మహేశ్ కుమార్ గౌడ్ ఫిర్యాదు మేరకు తనపై అన్యాయంగా కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. విచారణ కోసం అని పిలిచిన పోలీసులు తన వ్యక్తిగత ఫోన్‌ను సీజ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పాలనలో ప్రశ్నిస్తే కేసులతో భయభ్రాంతులకు గురిచేయడమేంటని ప్రశ్నించారు. వంద రోజుల పాలనకాకముందే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డా రు. కేసుల పెడితే భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

## అద్భుత భవనానికి ఏడాది!

### వార్షికోత్సవం సందర్భంగా యూఎస్ కాన్సులేట్ పోస్ట్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ నూతన భవనాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది. దీనిపై అమెరికా కాన్సులేట్ హర్షం వ్యక్తం చేసింది. ‘భారత్-అమెరికా మధ్య బంధాన్ని పటిష్ఠం చేసిన ఈ భవనం ప్రారంభమై ఏడాది పూర్తయింది’ అని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసింది.



హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ నూతన భవనంలో వార్షికోత్సవ వేడుకలు

## ఫోన్ మాట్లాడుతూ కదిలే రైలెక్కడం నేరం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రైళ్లు కదులుతున్న సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎక్కడం, దిగడం, పట్టాలు దాటడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని సౌత్ సెంట్రల్ రైల్వే హెచ్చరించింది. రైల్వేట్రాక్‌లు, పరిసరాల్లో సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడం, కదులుతున్న రైళ్లపై ఎక్కి రీల్స్ చేయడంతో ప్రాణహాని పొంచి ఉన్నదని రైల్వే అధికారులు ఓ ప్రకటనలో అధికారులు పేర్కొన్నారు. భారతీయ రైల్వే చట్టం-1989లోని సెక్షన్ 147 ప్రకారం రైల్వేట్రాక్‌ను దాటడం నేరమని పేర్కొన్నారు.

## కన్నారావు పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, మార్చి20 (నమస్తే తెలంగాణ): భూకబ్జా, హత్యాయత్నానికి పాల్పడ్డానన్న ఆరోపణలతో తనపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున తాము జోక్యం చేసుకోబోమని జస్టిస్ కే సుజన స్పష్టం చేశారు. చట్ట ప్రకారం ఈ కేసు దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రణీత్‌రావు కస్టడీపై వాదనలు పూర్తి

### నేడు హైకోరు తీర్పు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంలో తనను పోలీసు కస్టడీకి అప్పగిస్తూ కింది కోర్టు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఎస్‌ఐబీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును గురువారానికి రిజర్వు చేస్తున్నట్టు న్యాయమూర్తి జస్టిస్ జీ రాధారాణి ప్రకటించారు. అంతకుముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదన వినిపిస్తూ.. ఈ కేసుకు సంబంధించిన వాస్తవాలను కింది కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రణీత్‌ను పోలీస్ కస్టడీకి అప్పగించిందని తెలిపారు. కస్టడీకి సంబంధించిన నిబంధనలను పోలీసులు పాటించడం లేదని, కార్యాలయ పనివేళల్లో కాకుండా ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ప్రణీత్‌ను విచారిస్తున్నారని, విరామం లేకుండా 12 గంటల పాటు విచారణ జరపడం చట్ట వ్యతిరేకమని వివరించారు. ఈ విచారణకు ప్రణీత్ బంధువులను, న్యాయవాదిని అనుమతించడం లేదని, దర్యాప్తునకు సంబంధించిన అంశాలను పోలీసులు ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీక్ చేసి ప్రణీత్ పరువుకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. పోలీసుల కస్టడీ, దర్యాప్తు నిర్దిష్ట ప్రదేశంలో జరిగేలా చూడాలని, ఇంటరాగేషన్‌లో ఏఎస్పీ డీ రమేశ్ పాల్గొనకుండా కట్టడి చేయాలని కోరారు. అనంతరం పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. ప్రణీత్‌రావుపై దర్యాప్తు చట్ట ప్రకారమే జరుగుతున్నదని, విచారణ సమయంలో పోలీసులు ఆయన న్యాయవాదులను అనుమతిస్తున్నారని తెలిపారు. ప్రణీత్ తన న్యాయవాది ఫోన్ నుంచే తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాడని చెప్పారు. పిటిషనర్ నుంచి కీలక విషయాలను రాబట్టాల్సి ఉన్నందున పోలీస్ కస్టడీ యథావిధిగా కొనసాగించాలని కోరారు. దీంతో ఇరుపక్షాల వాదనలు పూర్తయినందున తీర్పును గురువారం వెలువరిస్తామని జస్టిస్ జీ రాధారాణి తెలిపారు.

- యాదగిరిగుట్టలో వైభవంగా చక్రతీర్థం



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహ స్వామి తిరు కల్యాణోత్సవం అనంతరం విశేష ఘట్టమైన శ్రీచక్రత్ ఆళ్వార్లకు పుణ్యతీర్థ స్నానం బుధవారం అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల్లో సాయంత్రం కల్యాణ లక్ష్మీనరసింహులకు శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపోత్సవం చేపట్టారు. - యాదగిరిగుట్ట

చిత్రం



## ‘ఇళయరాజా’ మొదలైంది

ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా జీవితం ఆధారంగా తమిళంలో రూపొందిస్తున్న ‘ఇళయరాజా’ చిత్రంలో అగ్ర హీరో ధనుష్ టైటిల్ రోల్‌ని పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా బుధవారం చెన్నైలో ఘనంగా ప్రారంభమైంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ధనుష్, కమల్ హాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ధనుష్.. ఇళయరాజా పాటలను స్ఫూర్తిగా తీసుకొని తాను నటనలో రాణిస్తున్నానని తెలిపారు. ‘ఇళయరాజా బయోపిక్‌లో నటించాలన్నది నా చిరకాల స్వప్నం. ఈ విషయాన్ని ఆలోచిస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. ఇళయరాజాకు నేను అభిమానిని కాదు. ఓ భక్తుణ్ని. ఆయన సంగీతం నటుడిగా నన్ను తీర్చిదిద్దింది. కెమెరా ముందుకు వెళ్లే ప్రతిసారి ఆయన సంగీతం వింటాను. నేను నటుడిగా ఎదగడం వెనక ఇళయరాజా సంగీతం ఇచ్చిన ప్రేరణ ఉంది’ అని ధనుష్ చెప్పారు. సినీ సంగీత ప్రపంచంలో అడుగుపెట్టే ముందు ఇళయరాజా జీవిత ప్రయాణానికి ఈ చిత్రం అద్దం పడుతుందని దర్శకుడు తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## రామ్‌చరణ్ స్పోర్ట్స్ డ్రామా షురూ



రామ్‌చరణ్ కథానాయకుడిగా ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఏ.ఆర్.రెహమాన్ స్వరకర్త. ముహూర్తపు సన్నివేశానికి మెగాస్టార్ చిరంజీవి క్లాప్‌నివ్వగా, బోనీ కపూర్ కెమెరా స్విచాన్ చేశారు. అగ్ర దర్శకుడు శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ ‘దర్శకుడు బుచ్చిబాబు ‘రంగస్థలం’ చిత్రానికి సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. అప్పటి నుంచి మా ప్రయాణం కొనసాగుతున్నది. ఈ సినిమాకు గొప్ప టీం కుదిరింది. నా కెరీర్‌లో ఇంత త్వరగా ఏ.ఆర్.రెహమాన్‌తో పనిచేస్తానని అనుకోలేదు. ఇది ఖచ్చితంగా అద్భుతమైన సినిమా అవుతుంది’ అన్నారు. ఈ కథ చాలా బాగుందని, ఇప్పటికే మూడు ట్యూన్స్ సిద్ధం చేశానని ఏ.ఆర్.రెహమాన్ తెలిపారు. ఈ సినిమా సాకారం కావడానికి ప్రధాన కారణం తన గురువు సుకుమారేనని, రామ్‌చరణ్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గొప్ప చిత్రాన్ని అందిస్తానని దర్శకుడు బుచ్చిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు శంకర్, సుకుమార్, నిర్మాత అల్లు అరవింద్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో క్రీడా కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రామ్‌చరణ్ నటిస్తున్న 16వ చిత్రమిది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు, ఆర్ట్: అవినాష్ కొల్లా, పాటలు: చంద్రబోస్, అనంత శ్రీరామ్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

## నాలుగు రెట్ల లాభం వచ్చింది



సరికొత్త పాయింట్‌తో ‘ఓం భీం బుష్’ చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రేక్షకుల్ని వినోదంతో పాటు థ్రిల్‌కు గురిచేసే అంశాలెన్నో ఉంటాయని చెప్పారు హీరో శ్రీవిష్ణు. ఆయనతో పాటు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు పాత్రికేయులతో పంచుకున్న సంగతులు..

- ముగ్గురు మిత్రుల కథ ఇది. సైంటిస్టులం కావాలని పీహెచ్‌డీ చేస్తుంటాం. అయితే మమ్మల్ని ఎలాగైనా కాలేజీ నుంచి పంపించాలని భావించిన యాజమాన్యం అందుకు ఓ స్కెచ్ వేస్తుంది. భైరవపురం అనే ఊరికి మా ముగ్గురిని పంపిస్తారు. అక్కడ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? కింగ్స్‌లా బతికే ఫ్రెండ్స్ అక్కడ కూడా అలాగే కింగ్స్‌లా ఎలా మారారు? నిధిని అన్వేషించే వారి ప్రయత్నాలు ఎంత మేరకు సఫలం అయ్యాయనే అంశాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి.
- ఈ సినిమాకు తొలుత రెండు మూడు టైటిల్స్ అనుకున్నాం. క్యాచీగా ఉంటుందని ‘ఓం భీమ్ బుష్’ను ఓకే చేశాం. మనందరం మ్యాజిక్కులు చేయడానికి వాడే మంత్రం కాబట్టి టైటిల్ అందరికి చేరువైంది. సినిమా టైటిల్స్ విషయంలో నేను ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాను. సినిమాను తొలుత ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లేది టైటిలే కదా.
- ఈ సినిమా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. కథలో ఓ కొత్త పాయింట్‌ను చర్చించాం. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని పాయింట్ అది. క్లైమాక్స్‌లో ఆ ఐడియా రివీల్ అయినప్పుడు ప్రేక్షకులు థ్రిల్‌గా ఫీలవుతారు. ఈ కథలో మిస్టరీ, థ్రిల్, ఫాంటసీ, కామెడీ..ఇలా అన్ని అంశాలు సమపాళ్లలో ఉంటాయి.
- నేను కలెక్షన్స్, మార్కెట్ లెక్కల గురించి అంతగా ఆలోచించను. నాతో సినిమా చేస్తున్న నిర్మాత నష్టపోకూడదనే విషయంపైనే దృష్టి పెడతాను. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడికి ప్రీరిలీజ్ బిజినెస్ ద్వారా ఇప్పటికే మూడు నాలుగురెట్ల లాభం రావడం సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం నేను ‘శ్వాగ్’ అనే చిత్రంలో నటిస్తున్నా. షూటింగ్ పూర్తయింది. ఓ థ్రిల్లర్ చిత్రం చేస్తున్నా. గీతా ఆర్ట్స్‌లో ఓ సినిమా, కోన వెంకట్‌తో ఓ సినిమాకు అంగీకరించా.

## అభినవ అశ్వత్థామ కథ



మహాభారతంలోని అశ్వత్థామ పాత్రను ఆధునిక యుగానికి పరిచయం చేస్తూ రూపొందిస్తున్న చిత్రం ‘అశ్వత్థామ ది సాగా కంటిన్యూస్’. షాహిద్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్నారు. సచిన్ రవి దర్శకుడు. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ ‘అశ్వత్థామకు మరణం లేదు. అతను చిరంజీవి. ఇప్పటికీ అశ్వత్థామ బతికే ఉన్నారని నమ్ముతుంటారు. ప్రస్తుత యుగంలో అశ్వత్థామకు ఎదురైన సవాళ్లేమిటో ఈ సినిమాలో చూపించబోతున్నాం. అశ్వత్థామ పౌరాణిక గాథను లోతుగా అధ్యయం చేసి ఈ సినిమా తీస్తున్నా. ఆరువేల సంవత్సరాలుగా తాను చూసిన ప్రపంచం నుంచి అతను ఏం గ్రహించాడు? అతని అన్వేషణ ఏమిటనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. భారీ యాక్షన్ ఘట్టాలతో తెరకెక్కించబోతున్నాం’ అన్నారు. పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వాషు భగ్నానీ, జాకీ భగ్నానీ, దీప్షికా దేశ్‌ముఖ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.



## రొమాంటిక్ ఎంటర్‌టైనర్

అరుణ్ ఆదిత్య, అప్సరరాణి జంటగా నటిస్తున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వినూత్న సెల్యూలాయిడ్స్ ఇండియా పతాకంపై నల్లా శ్రీదేవి నిర్మిస్తున్నారు. కృష్ణబాబు దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి గోపాలకృష్ణ క్లాప్‌నివ్వగా, సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ కెమెరా స్విచాన్ చేశారు. ఏప్రిల్ 20 నుంచి పది రోజుల పాటు తొలి షెడ్యూల్ జరుపుతామని, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా అందరిని అలరించే చిత్రమిదని దర్శకుడు కృష్ణబాబు తెలిపారు. తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్ర అవుతుందని కథానాయిక అప్సర రాణి చెప్పింది. లక్ష్మీ, బేబి వినూత, ఉదయ్‌భాను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.భాస్కర్, సంగీతం: యం.యం.శ్రీలేఖ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కృష్ణబాబు.



## ప్రేమ భావాల సూఫియానా..

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న చిత్రం ‘ఆయ్’. అంజి కంచిపల్లి దర్శకుడు. జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి మెలోడీ ప్రధానంగా సాగే ‘సూఫియానా..’అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటను రామ్ మిర్యాల స్వరపరచడంతో పాటు సమీర భరద్వాజ్, రమ్యశ్రీతో కలిసి ఆలపించారు. శ్రీమణి సాహిత్యాన్నందించారు. గోదావరి అందాల నేపథ్యంలో చక్కటి సాహిత్యంతో కన్నుల పండువగా ఈ పాట సాగింది. ప్రేమికుల మదిలోని భావాలకు అద్దం పట్టే చక్కటి గీతమిదని, శ్రావ్యమైన బాణీతో సంగీత ప్రియులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి, సంగీతం: రామ్ మిర్యాల, సమర్పణ: అల్లు అరవింద్, దర్శకుడు: అంజి కంచిపల్లి.



## సంగీత నేపథ్యంలో ‘నీదారే నీ కథ’

ప్రియతమ్, అంజన, విజయ్, అనంత్, వేద్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘నీదారే నీ కథ’. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో వంశీ జొన్నలగడ్డ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. దర్శకనిర్మాత వంశీ జొన్నలగడ్డ మాట్లాడుతూ ‘నేను న్యూయార్క్‌లో డైరెక్షన్ కోర్స్ చేశాను. మన తెలుగు నేటివిటీకి అనుగుణంగా చక్కటి కథాంశంతో ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశా. మ్యూజిక్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది’ అన్నారు. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్ ఇదని, అంతా కొత్తవారితో తెరకెక్కించామని శైలజ జొన్నలగడ్డ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అల్బర్టో గురియోలి, రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, నిర్మాతలు: వంశీ జొన్నలగడ్డ, తేజేష్, శైలజ జొన్నలగడ్డ, నిర్మాణ సంస్థ: జేవీ క్రియేషన్స్, దర్శకత్వం: వంశీ జొన్నలగడ్డ.